కవర్ స్టోరీ



# హేమంత సంతసం

వసంతానికి నేస్తాలు మల్లెలు.. మరి హేమంతానికి?
రంగురంగుల చేమంతులు.. అల్లిబిల్లి లిల్లిపూలు.. దోస్తులు.
తన రాకతో పరవశించే ప్రకృతికి మంచుతెరల చీర చుడుతుంది
ఈ రుతురాజ్ఞి. భానూదయాన్ని ఆలస్యం చేస్తూ.. పొద్దుపై పెత్తనం
చెలాయిస్తుంది. చీకట్లో శక్తి పుంజుకునే రాక్షసుల్లా.. మలిసంజె దాకా
వెచ్చగా మాటేసి ఆపై చలిపంజా విసురుతుంది. నెచ్చెలి ఉన్నవారికిది
కోరుకునే చలి. కీళ్లరిగిన వాళ్లకి మాత్రం కొరుకుడుపడని పులి.
లోతుగా గమనిస్తే.. జంట మాసాలను వెంటేసుకొని ఆగమించిన
హేమంతం ఆసాంతం సంతసమే!

... కె.సహస్ర

ఏ దేశంలో ఉండేవారికైనా తాము ఇతరులకంటే గొప్పవాళ్లం, తమ సంస్కృతి, వారసత్వం ఘనం అనే నమ్మకం ఉండి తీరుతుంది. అది సహజం. కానీ, చాలా ఇతర దేశాల వారు కూడా ఒప్పుకొనే ఓ మాట ఏమిటంటే... భారతీయులకు తాత్విక చింతన, విశ్లేషణా సామర్థ్యం చాలా ఎక్కువని! మేధస్సులో ఎవరికీ తీసిపోరు. ఇందుకు కారణంగా రక్తాలు, జన్యువులు లాంటి విషయాలన్నీ పక్కన పెట్టేస్తే ఓ స్పష్టమైన ప్రత్యేకత కనిపిస్తుంది. ఇక్కడి వాతావరణం. ఒక్కో రుతువూ క్రమంగా పరుచుకుంటూ... దాని ప్రభావాన్ని పూర్తిగా చూపించే ఆశ్చర్యకరమైన వాతావరణం ఈ అవనిలో కనిపిస్తుంది. భారతదేశంలో ఏ ప్రాంతంలో అయినా వేసవికీ, శీతకాలానికీ ఉష్ణోగ్రతల్లో 15 నుంచి 25 డిగ్రీల వరకూ వ్యత్యాసం కనిపిస్తుంది. రోహిణిలో వేసవి తాపానికి గొంతెండిన వాడు, ఆర్ద్రలో పడే చినుకులకు పరవశించిపోతాడు. ఎడతెరపి లేని వానలకు చిరాకుపడిన వాడు చలికాలం రాగానే మురిసిపోతాడు. ఇక్కడి మనుషులు మారిన రుతువులను ఎంతగా ఆస్వాదిస్తారో... నేల కూడా అంతగానే ప్రభావితం అవుతుంది.